సాక్షి వనపర్తి

బుధవారం : 11 : జనవరి : 2023



శబరిమలకు ప్రత్యేక బస్సులు

శబరిమలకు వెళ్లే అయ్యప్ప మాలధారుల కోసం ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నారు.

వివరాలు 10లో ▸



ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

సంక్రాంతికి చాలామంది సొంతూర్లకు వెళ్తున్నారు. ఇదే అదునుగా చోరులు ఇళ్లకు కన్నం వేస్తుంటారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.0 /15.0

మధ్యాహ్నం ఎండ తీవ్రత.. ఉదయం, రాత్రి చలి అధికంగా ఉంటుంది. చల్లటి గాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'పార్టీకి పూర్వ వైభవం తీసుకొద్దాం'



కొత్తకోట రూరల్ (పెద్దమందడి): నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు శ్రమించాలని టీపీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్, మాజీ మంత్రి జి.చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి మండలంలోని మోజర్లలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 26 నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపడుతున్న 'హాత్ సే హాత్ అభియాన్' పాదయాత్ర గురించి ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2 లక్షలు ఏకకాలంలో పంట రుణమాఫీ చేస్తోందని ప్రజలకు తెలిసేలా చెప్పాలని సూచించారు. బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారమే లక్ష్యంగా గడపగడపకు వెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం మండలస్థాయి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మండల నాయకులు పెంటన్న, శ్రీనివాసులు, త్రినాథ్, గట్టు మన్నెం, సురేష్ తదితరులు ఉన్నారు.

ఎంసెట్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



ఖిల్లాఘనపురం: ప్రభుత్వం మంచి ఉద్దేశంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిర్వహిస్తున్న ఎంసెట్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఐఈఓ జాకీర్ హుస్సేన్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఎంసెట్ తరగతులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేసేందుకు కమిషనర్ తరగతులు ఏర్పాటు చేశారన్నారు. అధ్యాపకులు ఉత్తమ బోధన అందించి ఫలితాల సాధనకు కృషి చేయాలని కోరారు. వచ్చే వార్షిక పరీక్షలు, ప్రాక్టికల్స్‌కు విద్యార్థులను సమాయత్తం చేయాలన్నారు. విద్యాపరంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన జానపద బృందం



వనపర్తి క్రైం: హైదరాబాద్‌లోని శిల్పారామంలో రాష్ట్రస్థాయి యువజనోత్సవాలు జరిగాయి. జానపద బృందంలో జిల్లాకేంద్రానికి చెందిన మునీశ్వరి అండ్ గ్రూప్ ప్రతిభ కనబర్చి రెండోస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా 10 మంది విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

అమరచింత: గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దాలని, పారిశుద్ధ్య కార్మికులను స్థానికంగా నియమించుకొనే వీలు సర్పంచ్‌లకు ఉందని డీపీఓ సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ఈర్లదిన్నె, కిష్టంపల్లిలో ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య కార్మికులు లేక ఈర్లదిన్నెలో చెత్తా చెదారం, మురుగు పేరుకుపోవడంతో గ్రామాన్ని సందర్శించారు. సర్పంచ్ చుక్క లక్ష్మమ్మ, వార్డు సభ్యులు, గ్రామస్తులతో సమావేశమయ్యారు. స్థానికులకు పారిశుద్ధ్య కార్మికులుగా నియమించుకుంటామని ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని డీపీఓ కోరారు. గ్రామంలో రైతులు, వ్యవసాయ కూలీలు ఉన్నారని.. పారిశుద్ధ్య పనులకు ఎవరూ ముందుకు రావడం లేదని, గ్రామంలో చాటింపు వేయించినా ఫలితం లేకపోయిందని సర్పంచ్ వివరించారు. ఇతర గ్రామాల వారిని నియమించుకోవాలని సర్పంచ్‌కు సూచించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న మన ఊరు – మన బడి పనులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయనవెంట ఎంపీఓ నర్సింహులు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు చుక్క ఆశిరెడ్డి తదితరులు ఉన్నారు.



మందకొడిగా..!

గ్రామాల్లో పన్ను వసూళ్లు అంతంత మాత్రమే



ఆత్మకూర్ మండలం తూంపల్లిలో పన్ను చెల్లింపులపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, కార్యదర్శి (ఫైల్)

- లక్ష్యం రూ.2.41 కోట్లు.. వసూలైంది రూ.29.6 లక్షలు
- ఇప్పటి వరకు 12 శాతమే వసూలు
- రెండు నెలల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరం



ఆత్మకూర్ మండలం పిన్నంచర్లలో పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి (ఫైల్)

ఆత్మకూర్: గ్రామపంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరైన పన్ను వసూళ్లు జిల్లాలో మందకొడిగా సాగుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు కేవలం రెండు నెలల వ్యవధి మాత్రమే ఉంది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా రూ.2.31 కోట్లు 100 శాతం వసూలు చేసి లక్ష్యం చేరుకున్నారు. ఈ ఏడాది జనవరి 10వ తేదీ నాటికి జిల్లావ్యాప్తంగా రూ.2.41 కోట్లకుగాను రూ.29.6 లక్షలు మాత్రమే వసూలు చేశారు. అంటే కేవలం 12 శాతమే వసూలయ్యాయి. ఫిబ్రవరి మొదటి వారంలోగా 100 శాతం పూర్తిచేసి లక్ష్యాన్ని చేరుకుంటామని అధికారులు చెబుతున్నారు. ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ముమ్మరంగా పర్యటిస్తూ పన్నులు వసూలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. వేగం పెంచితేనే లక్ష్యం చేరుకొనే అవకాశం ఉంది.

మండలాల వారీగా ఇలా..

మండలం	గ్రామాలు	లక్ష్యం	వసూలు	శాతం
వనపర్తి	26	14,71,003	4,66,802	32
ఖిల్లాఘనపురం	27	22,76,250	6,57,290	29
మదనాపురం	17	19,54,574	5,71,805	29
వీపనగండ్ల	14	13,17,933	1,90,877	14
శ్రీరంగాపూర్	8	11,03,477	1,57,560	14
అమరచింత	14	8,94,594	1,09,500	12
ఆత్మకూర్	13	11,71,692	1,16,696	10
పాన్‌గల్	28	22,26,504	2,20,109	10
చిన్నంబావి	17	14,28,879	1,03,660	7
గోపాల్‌పేట	15	21,72,579	1,24,360	6
పెద్దమందడి	22	15,99,920	69,980	4
కొత్తకోట	22	25,72,821	59,630	2
పెబ్బేరు	20	31,43,989	49,010	2
రేవల్లి	12	8,15,369	10,500	1

లక్ష్యం చేరుకుంటాం..



గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆస్తి పన్ను వసూళ్లు ముమ్మరంగా చేపడుతున్నాం. ఫిబ్రవరి మొదటి వారంలోగా 100 శాతం వసూలు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ప్రతి ఒక్కరూ సకాలంలో పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలి.

– రఘునాథ్‌రెడ్డి, డీఎల్‌పీఓ

జిల్లాలో ఇలా..

జిల్లాలోని వనపర్తి మండలం రూ.14,71,003 లక్షలకుగాను రూ.4,66,802 (32 శాతం) వసూలు చేసి మొదటి స్థానంలో ఉండగా.. రేవల్లి మండలంలో రూ.8,94,594కుగాను రూ.10,500 మాత్రమే వసూలై చివరి స్థానంలో నిలిచింది. సకాలంలో పన్నులు చెల్లించి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని సమావేశాల్లో అధికారులు చెబుతున్నా.. అందుకు అనుగుణంగా ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పన్ను వసూలు చేపట్టాల్సిన అధికారులు స్తబ్దుగా ఉండి చివర్లో హడావుడి చేస్తే ఎలా వసూలవుతాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి 100 శాతం వసూలు చేసి గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రైతువేదికలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా.. సమావేశంలో పాల్గొన్న అధికారులు

కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా

వనపర్తి: ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులను ఎప్పటికప్పుడు చైతన్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతువేదికలను నిర్మించిందని.. సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా కోరారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆయిల్‌పాం సాగు లక్ష్యాన్ని జిల్లా రైతులు ఇతర ప్రాంతాల కంటే ముందుగా చేరుకోవటం అభినందనీయమని కొనియాడారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చేసిన కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 2,500 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగుచేసి లక్ష్యాన్ని చేరుకున్నట్లు అధికారికంగా ప్రకటించారు. త్వరలోనే కొత్తకోటలో ఆయిల్‌పాం ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా ఉద్యాన అధికారి సురేశ్ మాట్లాడుతూ.. జిల్లాలో 12 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలు పెంచేందుకు స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. మూడు వేల ఎకరాలకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందని.. ఇప్పటికే 2,500 ఎకరాల్లో తోటలను ఏర్పాటు చేసి లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు వెల్లడించారు. మరో పది రోజుల్లో 1,040 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లాలోని నర్సరీల్లో 3.42 లక్షల నాణ్యమైన మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు సైతం మన జిల్లా నుంచే మొక్కలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. సమీక్షలో డీఏఓ సుధాకర్‌రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాంమోహన్, ఏఓ రాంచందర్‌రావు, ప్రి–యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధికారి సురేష్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

స్వశక్తితోనే మహిళల ఆర్థికాభివృద్ధి



ఉద్యాన కళాశాలలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

అదనపు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించినప్పుడే కుటుంబ పరిస్థితులు మెరుగుపడుతాయని అదనపు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం మండలంలోని మోజర్ల కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాలలో మహిళా సంఘాల సభ్యులకు కళాశాల ఆధ్వర్యంలో కూరగాయలు, పండ్లతో సబ్బులు, షాంపులు, అగరొత్తులు, లెమన్ గ్రాస్‌తో ఆయిల్ తయారీపై శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు ఇలాంటి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని స్వయంగా తయారు చేసి మార్కెటింగ్ చేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వినియోగదారులు ప్రకృతిసిద్ధంగా తయారు చేసిన సామగ్రిపైనే మక్కువ చూపుతున్నారని.. తయారు చేసిన ఉత్పత్తులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఉప ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించడంతో పాటు మహిళలు స్వశక్తిగా మారటానికి మార్గమని సూచించారు. శిక్షణ పొందిన మహిళలు వారి అభిప్రాయాలను వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ నర్సింహులు, అడిషనల్ డీఆర్‌డీఓ రేణుక, ఉద్యాన కళాశాల పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ ల్యాబ్ అధికారి డా. జె.శంకర్‌స్వామి, నాబార్డు అసోసియేట్ డీన్ లక్ష్మీనారాయణ, షణ్ముకచారి, ఇంది, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే లేఅవుట్ల ఏర్పాట్లు..

వనపర్తిటౌన్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేఅవుట్లను ఏర్పాటు చేయాలని అడిషనల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం లేఅవుట్ కమిటీ సభ్యులతో కలిసి పుర పరిధిలోని లేఅవుట్లను పరిశీలించారు. అనంతరం గణేష్‌నగర్ ప్రాంతంలో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఈఈలు మల్లయ్య, దేశ్యానాయక్, పుర కమిషనర్ విక్రమసింహారెడ్డి, మున్సిపల్, విద్యుత్ ఏఈలు తదితరులు ఉన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



మినీ లిఫ్ట్ ప్రారంభించి గంగమ్మకు పూలమాల వేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: జిల్లాలో సాగుకు యోగ్యమైన ప్రతి ఎకరాకు నీటిని అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో మెట్‌పల్లి మినీ ఎత్తిపోతల పథకం మోటార్లను ప్రారంభించి మాట్లాడారు. లిఫ్టు ఏర్పాటుతో మెట్‌పల్లి శివారులోని సుమారు రెండు వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని.. మెట్‌పల్లితో పాటు రంగంగడ్డ, నందిమళ్లగడ్డ, మేగ్యాతండాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. కాల్వలతో నీరందని ప్రాంతాల కోసం మినీ లిఫ్టులను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. చెరువులు, కుంటలు నింపటంతో భూగర్భ జలాలు సైతం వృద్ధి చెందుతున్నాయన్నారు. రూ.92 లక్షలతో మినీ లిఫ్ట్ ఏర్పాటు చేసి ఈదుల చెరువు నుంచి అయిదు ప్రాంతాలకు నీటిని పంపింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, సీఎస్‌ఆర్ నిధులతో నియోజకవర్గంలో ఇప్పటి వరకు 65 మినీ లిఫ్టులను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, నాయకులు, కౌన్సిలర్లు బండారు కృష, జోహెబ్, పరంజ్యోతి, రఘు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

'నష్ట పరిహారం ఇవ్వాలి'

వనపర్తి క్రైం: వనపర్తి శివారులో అయిదు చెరువుల అభివృద్ధిలో ముంపునకు గురవుతున్న ప్లాట్ల యజమానులకు భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 1,200 ప్లాట్లు ముంపునకు గురవుతున్నాయని, ముంపునకు గురయ్యే ప్లాట్లు, ఇళ్లను ఖాళీ చేయాలని అధికారులు నోటీసులు ఇచ్చారని సరికాదన్నారు. చెరువులను కృష్ణా జలాలతో నింపితే అమాయకులు నష్టపోతారని.. మంత్రి, కలెక్టర్ స్పందించి ముంపు బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కళావతమ్మ, చంద్రయ్య, శ్రీరాం, రమేశ్, కురుమన్న పాల్గొన్నారు.

అర్చకుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న అర్చక సంఘం నాయకులు

వీపనగండ్ల: గ్రామీణ ప్రాంత దేవాలయాల్లోని అర్చకులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడు పీవీ లక్ష్మీకాంతాచార్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని కల్వరాలలో 'మన ఊరు – మన గుడి' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అర్చకులకు ధూపదీప నైవేద్యం పథకం కింద రూ. రెండు వేలు ఇస్తున్నట్లు ప్రకటించినా.. సకాలంలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటడం, అర్చకులకు ప్రత్యామ్నాయ ఉపాధి లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అర్చక సంఘం నాయకులు నటరాజు, రవీందర్‌రావు, బాల్‌లింగయ్య, అర్చకుడు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అందని రేషన్

ఈ నెల పదిరోజులు గడిచినా పంపిణీ చేయని బియ్యం

- ఈ–పాస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కారణమంటున్న అధికారులు
- పండగ ముందు పేదలకు బియ్యం అందక ఇబ్బందులు
- డిసెంబర్ వరకు పొడిగించిన కేంద్ర ప్రభుత్వం
- రాష్ట్ర ప్రభుత్వ కోటాపై వీడని సందిగ్ధం



కల్వకుర్తిలో మూసి ఉన్న ఓ రేషన్ దుకాణం

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కార్డుదారులకు ఈ నెల రేషన్‌బియ్యం ఇంకా అందలేదు. ప్రతినెలా ఒకటో తేదీ నుంచే ప్రభుత్వం పేదలకు రేషన్‌బియ్యం పంపిణీ చేపడుతుండగా.. ఈ నెల పది రోజులు గడిచినా బియ్యం పంపిణీ ఊసేలేదు. దీంతో రేషన్‌కార్డుదారులు బియ్యం కోసం ఎదురుచూస్తున్నారు. మరో ఏడాదిపాటు యూనిట్‌కు పది కిలోల చొప్పున ఉచిత బియ్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించగా.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. జనవరి 1 నుంచే పేదలకు పది కిలోల ఉచిత బియ్యం పంపిణీ అమలుకావాల్సి ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వ సందిగ్ధంతో పంపిణీ ఆలస్యమవుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే బియ్యం కోటా వచ్చిందని అధికారులు చెబుతున్నా.. యూనిట్‌కు ఐదు కిలోలు మాత్రమే రావడంతో రేషన్ డీలర్లు సమాధానం చెప్పలేక దుకాణాలను మూసేస్తున్నారు.

దుకాణాల మూత..

ఈ నెల రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించి పదిరోజులు గడుస్తున్నా ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ఎక్కడా సరఫరా ప్రారంభించలేదు. కేంద్రం నిర్ణయం ప్రకారం జనవరి 1 నుంచి ఒక్కో యూనిట్‌కు పది కిలోల ఉచిత బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా.. ఐదు కిలోలు మాత్రమే వచ్చినట్టు డీలర్లు చెబుతున్నారు. ఉచిత బియ్యం పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోకపోవడమే జాప్యానికి కారణంగా తెలుస్తోంది. అయితే సాంకేతిక కారణాలతో ఈసారి బియ్యం పంపిణీ ఆలస్యమవుతుందని పౌరసరఫరా శాఖ అధికారులు చెబుతున్నారు. పీడీఎస్ బియ్యం పంపిణీకి సంబంధించిన ఈ–పాస్ వెబ్‌సైట్‌లో అప్‌డేషన్, మార్పులు చేపడుతుండటం జాప్యానికి కారణమని పేర్కొంటున్నారు.

పండగ పూట పేదల పరేషాన్

ప్రతినెలా 1 నుంచి 15 తేదీ వరకు రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు బియ్యం పంపిణీ చేపడుతున్నారు. ఈసారి పది రోజులైనా రేషన్ పంపిణీ ప్రారంభం కాలేదు. మిగిలిన నాలుగైదు రోజుల్లో రేషన్ పంపిణీ పూర్తయ్యే అవకాశం లేదు. దీంతో పంపిణీకి కాలపరిమితి పెంచుతారా.. లేదా.. అన్నది సైతం సందిగ్ధంగా మారింది. పండుగ ముందు రేషన్ బియ్యం పంపిణీ చేయకపోవడంతో పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో రేషన్‌కార్డుదారుల వివరాలు ఇలా..

జిల్లా	రేషన్ షాపులు	కార్డులు	నెలవారీ బియ్యం పంపిణీ (మె.ట.)
మహబూబ్‌నగర్	506	2,17,414	3,526.091
నాగర్‌కర్నూల్	558	2,38,877	4,929.121
వనపర్తి	325	1,56,739	4,889.340
జోగుళాంబ గద్వాల	333	1,60,287	2,964.820
నారాయణపేట	300	1,40,444	2,756.075



పస్తులుండాలా..?



సంక్రాంతి పండుగ వస్తున్నా ఈ నెల బియ్యం సరఫరా చేయలేదు. పండుగ పూట పస్తులుండాల్సి వస్తది. ఇప్పటికే నాలుగైదు సార్లు రేషన్ దుకాణానికి వెళ్లినా మూసుకునే ఉంది. అధికారులు స్పందించి వెంటనే బియ్యం సరఫరా చేయాలి.

– నిరంజనమ్మ, కంసానిపల్లి, ఉప్పునుంతల మండలం

దుకాణాలు తెరుస్తలేరు..



ఈ నెల పదో తేదీ దాటినా కూడా నేటికి రేషన్ బియ్యం సరఫరా చేయకపోవడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నాం. అసలే ఈ నెల సంక్రాంతి పండుగ వస్తుంది. కనీసం ఏమైందో చెప్పడానికి డీలర్లు దుకాణాలు కూడా తెరుస్తలేరు.

– తిమ్మన్న, అమ్మపల్లి, మాగనూర్ మండలం

రెండ్రోజుల్లో పంపిణీ చేస్తాం..

జిల్లాలో ఈ నెల పంపిణీకి కావాల్సిన బియ్యం రేషన్ దుకాణాలకు సరఫరా చేశాం. అయితే ఈ– పాస్‌లో అప్‌డేట్ కారణంగా సాంకేతిక సమస్యలతో బియ్యం పంపిణీ ఆలస్యమైంది. రెండు రోజుల్లో జిల్లాలో బియ్యం పంపిణీ ప్రారంభిస్తాం.

– మోహన్‌బాబు, జిల్లా పౌరసరఫరాశాఖాధికారి, నాగర్‌కర్నూల్

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి


గౌనికాడి చెన్నయ్య (ఫైల్)

మదనాపురం: మండల కేంద్రం సమీపంలో మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు రైలు కింద పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గౌనికాడి చెన్నయ్య(38) ఉదయాన్నే తన పొలానికి వెళ్తూ రైల్వే ట్రాక్ దాటుతుండగా, రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. శరీర భాగాలు గుర్తుపట్టరానంతగా విడి భాగాలుగా ఎగిరిపడ్డాయి. అటుగా వెళ్తున్న రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య నీలమ్మ ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

బిజినేపల్లి: మండల కేంద్రానికి చెందిన శ్రీను(30) అనే వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బిజినేపల్లి ఎస్ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బిజినేపల్లికి చెందిన శ్రీను అనే వ్యక్తి మద్యానికి అలవాటు కావడంతో భార్య పుష్ప ఆవేదనతో పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన శ్రీను సోమవారం పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు శ్రీనును నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స కోసం తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి : కేసు నమోదు

రాజోళి: మండలంలోని పెద్దధన్వాడలో వ్యక్తిపై దాడి చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనువాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దధన్వాడకు చెందిన ప్రవీణ్ భార్యతో గ్రామానికి చెందిన నల్లబోతుల రాజు అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే అనుమానం, పాతకక్షలతో మంగళవారం స్థానిక చర్చి ఎదుట ఇనుప రాడ్‌తో తలపై దాడి చేశాడు. దీంతో రాజుకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై రాజు తండ్రి యేసేపు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఆటోడ్రైవర్‌కు జైలుశిక్ష


మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి ఆటో నడిపిన డ్రైవర్‌కు న్యాయమూర్తి జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చారు. మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులు ఇటీవల చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో జిల్లాకేంద్రంలోని హబీబ్‌నగర్‌కు చెందిన ముస్తఫా అనే ఆటో డ్రైవర్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. దీంతో మంగళవారం అతడిని కోర్టులో హాజరుపరచగా మహబూబ్‌నగర్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి డి.నిర్మల మూడురోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పడంతో రూరల్ పోలీసులు ఆటోడ్రైవర్‌ను జైలుకు తరలించారు.

రెండో పెళ్లి చేసుకున్నాడని ఫిర్యాదు

రాజోళి: అదనపు కట్నం కోసం వేధించడంతో పాటు రెండో పెళ్లి చేసుకున్న భర్తపై రాజోళి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలంలోని పెద్ద తాండ్రపాడుకి చెందిన రేపల్లె సుజాతకు అదే గ్రామానికి చెందిన గట్టు కుర్మన్నతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి అయిన రెండు సంవత్సరాలు బాగానే ఉన్న భర్త, తర్వాత తన తల్లిదండ్రులతో కలిసి అదనపు కట్నం కావాలని శారీరకంగా, మానసికంగా వేధించేవారు. విసుగు చెందిన భార్య సుజాత పుట్టింటికి వచ్చేసింది. ఇదిలాఉండగా, తాజాగా భర్త కుర్మన్న మరో వివాహం చేసుకోవడంతో ఆమె రాజోళి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనువాసులు తెలిపారు.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

- ఉమ్మడి జిల్లాలో ఇటీవల పెరిగిన చోరీలు
- సంక్రాంతి నేపథ్యంలో జాగ్రత్తలు సూచిస్తున్న పోలీసులు



మహబూబ్‌నగర్ క్రైం: సంక్రాంతి పండుగ వస్తున్న నేపథ్యంలో మరో మూడురోజుల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఇవ్వనున్నారు. దీంతో చాలా మంది పట్టణాలు విడిచి.. సొంత ఊళ్లకు, యాత్రల పేరిట ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇలా వెళ్తున్న వారు ఇంటికి తాళాలు వేసి వెళ్లడం జరుగుతుంది. ఇదే అదునుగా భావించే చోరులు ఇంటికి కన్నం వేస్తుంటారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు నలుగురిలో గుర్తింపు కోసం కష్టపడి దాచుకున్న బంగారం.. అవసరాలకు కూడబెట్టుకున్న నగదును ఒక్కరాత్రిలో దోచుకుంటే.. ఆర్థికంగా వారు ఏళ్ల వెనక్కు వెళ్లాల్సిందే. కొన్నేళ్ల కష్టం ఒక్కరోజులో మాయమైతే వారి బాధ వర్ణనాతీతం. అయితే ఇటీవల చోరీ కేసులు పెరుగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

రాత్రిపూటనే ఎక్కువగా..

మహబూబ్‌నగర్ జిల్లాలో నమోదైన చోరీ కేసులు పరిశీలిస్తే రాత్రి సమయంలోనే అధికంగా జరిగాయి. 2020లో మొత్తం 211 దొంగతనం కేసులు నమోదవగా.. దీంట్లో 116 కేసులు ఛేదించారు. 2021లో 287 కేసులు నమోదైతే.. 194 కేసులు, 2022లో 303 దొంగతనం కేసులు నమోదవగా.. 137 కేసులు ఛేదించారు. మొత్తంగా ఈ మూడేళ్ల కాలంలో 801 దొంగతనం కేసులు నమోదవగా.. కేవలం 447 కేసులు ఛేదించగలిగారు. ఏదేమైనా చోరీ కేసుల్లో కోల్పోయిన సొమ్ము బాధితులకు లభించకపోవడంతో ఎంతోమంది ఆర్థికంగా చితికిపోతున్నారు. దొంగిలించిన సొమ్ములో దాదాపు 50 శాతం రికవరీ కావడం లేదు. జిల్లాలో రాత్రి చోరీలు, సాధారణ దొంగతనం కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి.

పెరుగుతున్న నేరగాళ్లు

ప్రస్తుతం పోలీసుల్లోనూ సెలవుల బెంగ పట్టుకుంది. సెలవుల్లో చాలామంది తమ ఇళ్లకు తాళాలు వేసి దూర ప్రాంతాలకు వెళ్తుంటారు. ప్రతిఒక్కరి దృష్టి పండుగ వేడుకల మీద ఉంటుంది. ఇదే సమయంలో తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు రెచ్చిపోయే ప్రమాదం ఉంది. గతంలో ఈ సీజన్‌లో చాలా మేర దొంగతనాలు కేసులు కూడా నమోదయ్యాయి. ఇటీవల తాళం వేసి ఉన్న ఇళ్లపై దొంగలు ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి ఉన్నదంతా ఊడ్చుకుపోతున్నారు. రోజురోజుకూ నేరగాళ్ల సంఖ్య పెరుగుతుండటంతో వారిని గుర్తించడం పెద్ద తలనొప్పిగా మారింది.

ఈ ప్రాంతాల్లోనే అధికం..

మహబూబ్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇటీవల తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు ఎక్కువ కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పలు కాలనీల్లో గస్తీని పెంచినా దొంగలు తమ పని కానిచ్చేస్తున్నారు. దొంగలు ప్రధానంగా పట్టణ శివారు కాలనీలు, జన సంచారం తక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. ఇన్ని చోరీలు జరుగుతున్నా.. కొందరు ప్రజలు ఇప్పటికీ అప్రమత్తంగా వ్యవహరించడం లేదు. చోరీలు జరిగిన తర్వాత పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు తప్ప ముందస్తు జాగ్రత్తలు మాత్రం ఎవరూ తీసుకోవడం లేదు. దీంతో చాలా వరకు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది.

ఇవి పాటించాలి..

- ఎక్కువ రోజులు ఊర్లో వారు పక్కింటి వారితోపాటు.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వడం మంచిది.
- ప్రధాన ద్వారాలు కాకుండా ఇతర ద్వారాలు ఉంటే వాటికి తాళం వేస్తూ మిగతా వాటికీ లోపలి భాగాలకు తాళం వేయాలి. అలా వేయడంతో ఇంట్లోని వాళ్లు ఊరు వెళ్లారనే అనుమానం రాకుండా ఉంటుంది.
- ఇంట్లో లేకున్నా గదుల్లో విద్యుత్ దీపాలు వేసి ఉంచాలి. దీంతోపాటు తాళం వేసి ద్వారాలకు పరదాలు, కర్టెన్లు వేస్తే కనబడకుండా ఉంటాయి.
- విలువైన ఆభరణాలు, నగదు వెంట తీసుకెళ్లాలి. లేకుంటే బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి.
- రాత్రిపూట ఒంటరిగా వెళ్లాల్సి వస్తే మహిళలు తక్కువగా ఆభరణాలు ధరించాలి.
- ఊర్లో ముందు ద్విచక్రవాహనాలు ఆరుబయట, ప్రహరీ లోపల, ఇంటి ముందు పెట్టి వెళ్లకూడదు. వాహనానికి జాగ్రత్తగా తాళం వేసి సుపరిచితుల ఇళ్లలో పెట్టిపోవడం చాలా మంచిది.
- సెలవుల్లో కుటుంబ సభ్యులు ఊరెళ్లినప్పుడు ఆభరణాలకు రంగులు, మెరుగులు అద్దుతాం అంటూ ఇళ్లకు వచ్చే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు వచ్చినవారి ప్రాంతం, వారి గుర్తింపు కార్డులు పరిశీలించడం మంచిది.
- మహిళలు ఇంట్లో ఒంటరిగా ఉంటే ఇల్లు, గదులు అద్దె కోసం వచ్చినవారికి లేవని చెప్పడమే ఉత్తమం.
- అనుమానాస్పద వ్యక్తులు కాలనీల్లో సంచరిస్తుంటే 100కు లేదా పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలి.

గస్తీ పెంచాలి..

సెలవుల్లో చాలామంది వివిధ ప్రాంతాలకు, సొంత గ్రామాలకు ఎక్కువగా వెళ్లే వారి ప్రాంతాలు, కాలనీల్లో గస్తీని ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని మూడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్, రక్షక్‌లతో రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు గస్తీ నిర్వహించాలి. మూడు పోలీస్ స్టేషన్స్ పరిధిలో రోజుకు పలు బీట్లు ఏర్పాటు చేసుకోని బృందాలుగా తిరుగుతూ శాంతి భద్రతలు పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

కల్వకుంట్ల పాలనలో తెలంగాణ ఆగమైంది

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

కొల్లాపూర్ రూరల్: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కల్వకుంట్ల కుటుంబ పాలనలో ఆగమైందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండలంలోని సింగోటంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు చేస్తున్న ప్రగతికోసం పాదయాత్రకు డాక్టర్ లక్ష్మణ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ చెప్పిన ఏ ఒక్క మాట నిలబెట్టుకోలేదని ఆరోపించారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని మోసం చేశారని విమర్శించారు. నేటి వరకు మూడెకరాల భూమి అమలు కాలేదన్నారు. పేదల భూములను లాక్కుంటున్నారని తెలిపారు. గెలిచిన ఎమ్మెల్యేలు భోగభాగ్యాలు అనుభవిస్తుండగా, ఓడిపోయిన సుధాకర్‌రావు గ్రామాలు తిరుగుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో సుధాకర్‌రావును ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

శ్రమను తగ్గించే వ్యవసాయం చేయాలి

- పాలెం ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్. డా. గోవర్ధన్

బిజినేపల్లి: వ్యవసాయరంగం శ్రమ మీద ఆధారపడటంతో పెట్టుబడి పెరుగుతోందని.. రైతులు శ్రమశక్తిని తగ్గించే పరికరాలు, యంత్రాలు వినియోగించాలని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డా. గోవర్ధన్ కోరారు. మంగళవారం పాలెం ఆర్ఏఆర్ఎస్‌లో మండల రైతులకు వాతావరణ మార్పులు, సాగులో అనుసరించాల్సిన విధానంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు దుక్కుల నాటి నుంచి విత్తనోత్పత్తి, కలుపు నివారణ, వాణిజ్య పంటలు, కూరగాయలు, పండ్ల తోటల సాగులో సస్యరక్షణ చర్యలను అవలంబించాలన్నారు. వ్యవసాయం ప్రధానంగా వాతావరణం మీద ఆధారపడి ఉంటుందని, సాగు, చీడపీడల నివారణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నూనెగింజల ప్రధాన శాస్త్రవేత్త డా.సుజాత, జిల్లా వ్యవసాయాధికారి వేంకటేశ్వర్లు, ఆయా విభాగాల, శాఖల అధికారులు డా. రామకృష్ణ, పరిమళ, ఏఈఓ విష్ణు, మండలానికి చెందిన రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తెగిన చెరువు పాటు కాల్వ

నీటిలో మునిగిన వరినాట్లు


గుడిబండలో నీట మునిగిన వరినాట్లు

అడ్డాకుల: మండలంలోని గుడిబండలో చెరువు పాటు కాల్వ తెగిపోయి వరినాట్లు నీటి మునిగాయి. మండలంలో విస్తరించి ఉన్న పెద్దవాగులో ప్రస్తుతం కృష్ణా నీళ్లు పారుతున్నాయి. కందూర్ స్టేజీ వద్ద వాగు నీళ్లు దిగువకు వెళ్లకుండా అడ్డుకట్ట వేసి గుడిబండ పెద్ద చెరువులోకి నీళ్లను మళ్లించారు. ఈ నీళ్లు వెళ్లే కాల్వ గుడిబండ శివారులో మంగళవారం తెగిపోయింది. దీంతో కాల్వ దిగువన ఉన్న పొలాల్లో నీళ్లు పారుతున్నాయి. ఇటీవలే రైతులు వరినాట్లు వేయగా, అవి నీళ్లల్లో మునిగిపోయాయి. చెరువు ఆయకట్టులో చివర ఉన్న పొలాలకు వేసవికాలంలో నీళ్లు సరిపోవని వాగులో వెళ్తున్న నీళ్లను చెరువులోకి మళ్లించారు. వాగు నుంచి చెరువులోకి నీళ్లు వచ్చే పాటు కాల్వ తెగిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. ఇదిలా ఉండగా, వాగు నుంచి చెరువు వరకు ఉన్న పాటు కాల్వ కొంత భాగం సోలార్ పరిశ్రమలో ఉంది. అక్కడ సిమెంట్ పైపులను వేయగా, వాటిలో చెత్త పేరుకుపోవడంతో నీళ్లు ముందుకు వెళ్లడం లేదు. దీనివల్ల పాటు కాల్వకు గండ్లు ఏర్పడి నీళ్లు పంట పొలాలను ముంచెత్తుతున్నాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తండాల్లో ఎక్సైజ్ దాడులు


అన్నారెడ్డిపల్లితండాలో పట్టుబడిన వారితో అధికారులు

మహమ్మదాబాద్: మండలంలోని పలు తండాల్లో మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. మండలంలోని శేక్‌పల్లితండా, బొమ్మికుంటతండా, కొలిమికుచ్చతండా, సామలకుంట తండా, అన్నరెడ్డిపల్లితండాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించారు. మొత్తంగా 80లీటర్ల సారాను పారబోసి, మరో చోట 9లీటర్ల సారాను సీజ్ చేశారు. పట్టుబడిన ముగ్గురిపై ఎక్సైజ్ అధికారులు కేసులు నమోదు చేశారు. దాడుల్లో మహబూబ్‌నగర్, కోస్గి ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని మంగళవారం పట్టుకున్నామని, కేసు నమోదు చేశామని ఎస్ఐ రామస్వామి తెలిపారు. పెబ్బేరుకు చెందిన సంబు వెంకటస్వామి చుట్టు పక్కల ప్రజల నుంచి రేషన్ తక్కువ ధరకు కొనుగోలు చేసి, అధిక ధరకు మదనాపురంలో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు తెలిపారు. 21క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నామని, వాహనాన్ని సీజ్ చేశామని ఎస్ఐ తెలిపారు.

ఫేక్ పేటీఎం యాప్‌తో మోసం


బట్టలు కొనుగోలు చేస్తున్న నిందితుడు

కొల్లాపూర్: పట్టణంలోని పోలీస్ డెనిమ్ బట్టల దుకాణంలో ఫేక్ పేటీఎం యాప్‌తో ఇద్దరు యువకులు మోసానికి పాల్పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బట్టల దుకాణంలో ఇద్దరు వ్యక్తులు రూ.6,240ల విలువ గల బట్టలను సోమవారం కొనుగోలు చేశారు. ఫేక్ పేటీఎంతో అమౌంట్ ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ఫోన్‌లో చూపించారు. వారు వెళ్లిపోయిన తరువాత బట్టల దుకాణ యజమాని అకౌంట్ చెక్ చేసుకోగా, నగదు జమకాలేదు. దీనిపై యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులిద్దరూ బ్లాక్‌కలర్ పల్సర్ బైక్‌పై దుకాణానికి వచ్చినట్లు సీసీ టీవీ ఫుటేజీ ద్వారా గుర్తించారు. నిందితులకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియా ద్వారా షేర్ చేస్తున్నట్లు ఎస్ఐ బాలవెంకటరమణ వెల్లడించారు. సమాచారం తెలిస్తే తెలియజేయాలని ఆయన కోరారు.

భార్యాభర్తల బలవన్మరణం


వెంకటమ్మ, హన్మంతు (ఫైల్)

ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు వెంకటమ్మ(58), హన్మంతు(65) హైదరాబాద్‌లో మంగళవారం ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో స్వగ్రామం కిష్టాపూర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన వెంకటమ్మ, హన్మంతు గ్రామంలో అప్పులు ఎక్కువకావడంతో బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు మూడేళ్ల క్రితం వలస వెళ్లారు. అప్పు తీర్చాలంటూ ఒత్తిడి పెరగడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం అందజేసిన దళితులకు 3ఎకరాల భూమిలో వెంకటమ్మ పేరు లబ్ధిదారుల జాబితాలో ఉంది. వీరికి కుమారుడు ఉన్నాడు. ఈ ఘటనపై కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

పశుగ్రాసం దగ్ధం

దేవరకద్ర రూరల్: కౌకుంట్ల మండలం పుట్టపల్లిలో ఐదు ట్రాక్టర్ల పశుగ్రాసం పూర్తిగా దగ్ధమైంది. స్థానిక వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల గోవిందు ఐదు ట్రాక్టర్ల గడ్డిని పొలం వద్ద నిల్వ ఉంచాడు. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డికి నిప్పంటించడంతో పూర్తిగా దగ్ధమైంది. గడ్డి విలువ రూ.50వేలు ఉంటుందని రైతు వాపోయాడు.

లారీలోని ఐరన్ అపహరణ

ఎర్రవల్లిచౌరస్తా: లారీలోని ఐరన్ చోరీ అయిన సంఘటన ఇటిక్యాల మండలంలోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కోదండాపురం ఎస్సై వెంకటస్వామి కథనం మేరకు... హైదరాబాద్ నుంచి ఐరన్ లోడ్‌తో ఏపీ12 వి7848 నంబర్ గల లారీ కడప జిల్లాలోని బద్వేల్ వెళ్తుంది. ఈ క్రమంలో జాతీయ రహదారిపై వేముల ధర్మవరం స్టేజీల మధ్యలోకి రాగానే తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు డీసీఎం వాహనంలో వచ్చి ఐరన్ లారీని అడ్డగించి, డ్రైవర్‌ను బెదిరించి అందులో ఉన్న ఐరన్‌ను అపహరించినట్లు ఎస్సై తెలిపారు. అపహరణకు గురైన ఐరన్ విలువ దాదాపుగా రూ.6లక్షల వరకు ఉంటుందని, లారీడ్రైవర్ గంట విలియం ఫిర్యాదు మేరకు సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తును చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మల్దకల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని శేషంపల్లి స్టేజీ సమీపంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. అయిజకు చెందిన షరీఫ్(35) మెకానిక్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మంగళవారం షరీఫ్ తమ కుమారుడిని చికిత్స నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తీసుకెళ్లారు. తిరుగు ప్రయాణంలో షరీఫ్ శేషంపల్లి స్టేజీ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడటంతో షరీఫ్ అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి భార్య శేకున్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

వరిలో సల్ఫైడ్ ఇంజురి


సల్ఫేట్ ఇంజురి సోకి ఎండిన మొక్క

అలంపూర్: రబీలో సాగు చేసిన వరి పంటలో మొక్కలు అక్కడక్కడ చనిపోతాయి. తెగుళ్లు లేదా పురుగులు ఆశించడం వల్ల చనిపోవడంలేదని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచించారు. సల్ఫైడ్ ఇంజురి వలన మొక్కలు చనిపోతున్నట్లు తెలిపారు. సల్ఫైడ్ ఇంజురి గురించి ఆయన రైతులకు వివరించారు. వరి పొలాల్లో మురుగు నీరు ఎక్కువ రోజు నిల్వ ఉండటంతో సల్ఫైడ్ ఇంజురి తలెత్తినట్లు తెలిపారు. మురుగు నీటి పారుదల సరిగ్గా లేని పొలాల్లో ముఖ్యమైన సమస్య సల్ఫైడ్ ఇంజురి. దీని వలన మొక్కల వేర్ల వద్ద ప్రాణ వాయువు లభ్యత తగ్గి అధిక మొత్తంలో మాంగనీజ్ ఇనుప ధాతువులు విడుదలవుతాయని, ఆ తర్వాత సల్ఫేట్ రూపంలో ఉన్న గంధకం నుంచి సల్ఫైడ్ విష వాయువు ఉత్పన్నమవుతుందని తెలిపారు. దీంతో పొలాల నుంచి మురిగిన కోడిగుడ్ల వాసన గల హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు బుడగల రూపంలో బయటికి వస్తుందని, బురద నల్ల రంగులో చెడువాసనతో ఉంటుందని, ఆ మట్టిని కొంతసేపు ఎండలో ఉంచితే రంగు మారి సాధారణ స్థితికి వస్తుందని పేర్కొన్నారు.

సల్ఫైడ్ ఇంజురీ లక్షణాలు..

వరి మొక్కలు మొదట వాడినట్లు కనిపించి తరువాత ఎడిపోతాయి. ముదురు ఆకులు పసుపు రంగుకు మారి ఆపై ఎండిపోతాయి. ఆ తర్వాత క్రమంగా పక్క పిలకలు కూడా ఎండిపోతాయి. మొక్కలను పీకి తీస్తే వేర్లను నీటిలో కడిగి చూస్తే వాటిపై నల్లటి రంగు పార ఉంటుంది. వేర్లను కొంతసేపు గాలి తగిలేలా ఉంచితే నల్లటి పార కొద్ది నిమిషాల్లో ఎరుపు లేదా గోధుమరంగుకు మారుతుంది. చాలా బలహీనపడ్డ మొక్కలు చీడపీడలకు గురవుతాయి.

నివారణ..

సాగులో ఉన్న పొలాల్లో నిల్వఉన్న మురుగు నీటిని వెంటనే బయటికి పారించాలి. పొలం మడుల చుట్టూ అడుగున్నర లోతు కాలువ తీసి నీటిని తీసివేయాలి. నేల ఉపరితలాన సన్నటి పగుళ్లు వచ్చే వరకు ఆర నివ్వాలి. తరువాత కొత్త నీరు పెట్టాలి. ఇలా ఆర బెట్టడం, కొత్త నీరు పారించడం నాలుగు లేక ఐదుసార్లు చేయాలి. దీని వలన నేలలో ప్రాణ వాయువు సరఫరా పెరిగి మొక్క నిలదొక్కుకుంటుంది. నేలను ఆర బెట్టడం వలన నత్రజని వృథా అవుతుంది. కావున మరొక మోతాదు నత్రజని ఎరువులు వేయరాదు. జింకు లోపం కనిపిస్తే రెండుశాతం జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పైరుపై పిచికారీ చేసుకోవాలి.

నూతన వంగడాలతో అధిక దిగుబడి


మాట్లాడుతున్న కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి

తెలకపల్లి: నూతన వంగడాలతో అధిక దిగుబడి సాధించవచ్చని పాలెం శాస్త్రవేత్త ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పర్వతాపూర్‌లో కంది పంటపై సామూహిక ప్రదర్శన క్షేత్రాలలో కంది పంటను సందర్శించారు. పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కందిలో క్షేత్రప్రదర్శనలో భాగంగా పర్వతాపూర్‌లో కంది పంటలను సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. అధిక దిగుబడులుఇచ్చే నూతన వంగడాలను, ఉత్పాదకాల గురించి వివరించారు. పంటల మార్పిడి వల్ల మంచి దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఆదిశంకర్, ఉద్యాన శాస్త్రవేత్త శైల, కీటక శాస్త్రవేత్త బి రాజశేఖర్, వ్యవసాయ విస్తరణ అధికారి భార్గవసాగర్, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడాకారులకు క్రికెట్ కిటు



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని శ్రీ చౌడేశ్వరిదేవి ఉత్సవాలు పురస్కరించుకొని పీపీఎల్–13 ఎడిషన్ క్రికెట్ క్రీడాకారులకు కిట్లను మంగళవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞా రెడ్డి వితరణ చేశారు. పట్టణంలో ప్రతిఏటా శ్రీచౌడేశ్వరిదేవి ఉత్సవాలు నిర్వహించడంతో పాటు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తారని, తన వంతుగా ఈ ఏడాది కిట్లను వితరణ చేశానని తెలిపారు. కార్యక్రమంలో సహదేవుడు, కంచె అంజనేయులు, వెంకట్రామిరెడ్డి, విజయ్, శివ, చిన్నరాములు, చంద్రశేఖర్, అసాద్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త తండాలో పారిశుద్ధ్య పనులు



అమరచింత: పట్టణంలోని రెండో వార్డు పరిధిలోని కొత్త తండాలో పారిశుద్ధ్య పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి శ్రీకారం చుట్టామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా, వార్డు కౌన్సిలర్ లావణ్య తెలిపారు. మంగళవారం తండాలోని ఆయా వీధుల్లో ఇళ్ల మధ్య పెరిగిన ముళ్ల పొదలను తొలగిస్తూ, జాలు వారిన విద్యుత్ వైర్లను సరిచేశారు. హాస్టల్‌లోని మైదానంలో కబడ్డీ, వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేశామన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



ఆత్మకూర్: కేవీపీఎస్ సంఘం 2023 క్యాలెండర్లను మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ పుట్ట మహేష్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్, జిల్లా కార్యదర్శి అజయ్, శాంతన్న, చంద్రశేఖర్, తేజ, ఖాజపీర్ ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



గోపాల్‌పేట: రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థిగా బరిలో ఉంటున్న తనను గెలిపించాలని జనార్దన్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల పాఠశాల, కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో ప్రచారం చేశారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

డ్రమ్ సీడర్ పద్ధతిలో అధిక లాభాలు

వీపనగండ్ల: డ్రమ్ సీడర్ పద్ధతి ద్వారా వరి పంటను సాగు చేయడం వల్ల అధిక లాభాలను పొందొచ్చని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం గోపల్‌దిన్నెలో డ్రమ్ సీడర్ పద్ధతిలో వరిసాగు గురించి రైతులకు అవగాహన కల్పించారు. దీంతో కూలీల ఖర్చు తగ్గడంతో పాటు తెగుళ్లను నివారించవచ్చని తెలిపారు. ఈ పద్ధతికి చవుడు నేలలు, నీరు అధికంగా నిల్వ ఉండే పొలాలు పనికి రావన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శివ, పలువురు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని సేవా భారతి శ్రీరంగాపురం శాఖ వారిచే మంగళవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో 110 విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ చేశామని ఆర్గనైజర్ నవీన్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, హెచ్‌ఎం కురుమయ్య, అధ్యాపకులు కురుమూర్తి, సేవా భారతి సభ్యులు ,ల్యాబ్ టెక్నీషియన్ సురేష్, శ్రీను, చైతన్య పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం 1098 చైల్డ్ లైన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం ఎస్‌ఐ స్వాతి మాట్లాడుతూ బాలికలపై అరాచకాలు, ఈవ్‌టీజింగ్, ఇబ్బందులకు గురిచేస్తే షీ టీంకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జయరాములు, కౌన్సిలర్ అక్కమ్మ, చైల్డ్ కో ఆర్డినేటర్ ప్రశాంతి, ఎస్‌ఐ రామస్వామి, కానిస్టేబుళ్లు రమేష్, శ్రీనివాస్, కృష్ణ, అశోక్‌కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.



'కంటి వెలుగు'ను జయప్రదం చేద్దాం



వనపర్తిలో మాట్లాడుతున్న చైర్మన్, వైస్ చైర్మన్



వీపనగండ్లలో..



పాన్‌గల్‌లో..

వనపర్తి టౌన్: మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో కంటి వెలుగు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ తెలిపారు. ఈనెల 18నుంచి మొదలు కానున్న కంటి వెలుగు కార్యక్రమంపై మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి వార్డులో 10రోజుల పాటు కంటి వెలుగు కేంద్రాలు ఉంటాయన్నారు. వార్డులో దృష్టి లోపం ఉన్నవారిని గుర్తించి, కంటి వెలుగు కేంద్రాలకు తీసుకొచ్చేందుకు కౌన్సిలర్లు, మహిళా సంఘాల ఆర్పీలు చొరువ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, నాగన్న, విభూది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఈనెల 18వ తేదీ నుంచి మండలంలో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కంటి వెలుగుపై ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్, ఆశా కార్యకర్తలు, మహిళ సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. మండలంలో మూడు టీంల చొప్పున విధులు నిర్వహిస్తారని, 18ఏళ్ల వయస్సు ఉన్నవారి నుంచి కంటి వెలుగు పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ ఏసయ్య, వైద్యాధికార్లు రాకేష్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కమలేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక మండల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లో వంద రోజుల్లో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సిబ్బందితో పాటు పరికరాలు కూడ సిద్ధం చేసినట్లు మండల వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పాండునాయక్, ఎంపీడీఓ కతలప్ప, ఏపీఓ శేఖర్‌గౌడ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ, సర్పంచ్‌లు రఘునాథ్‌రెడ్డి, రామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని ఎంపీపీ కృష్ణానాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమంపై ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, కమాలోద్దీన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రిజ్వాన తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: మండలంలో పనిచేస్తున్న ఉపాధి కూలీల జాబ్‌కార్డుకు ఆధార్‌కార్డు అనుసంధానం త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు వంద శాతం సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని, మరుగుదొడ్లు నిర్మించుకున్న ఇళ్లల్లో సింగిల్ పిట్ ఉన్న వారికి డబుల్ పిట్ తీయించాలని ఆదేశించారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం(ఎన్ఎంఎంఎస్) విధానం ద్వారా ఉపాధి కూలీల హాజరు రెండు సార్లు నమోదు చేయాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీళ్ల పట్టాలన్నారు. సమావేశంలో ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ, బీఆర్ఎస్‌లకు గుణపాఠం తప్పదు'



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న నాగరాజుగౌడ్

ఆత్మకూర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టనున్న హాత్‌సే హాత్‌జోడో యాత్రను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్, రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆత్మకూర్‌లోని పార్టీ కార్యాలయంలో మండల స్థాయి ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు చేపట్టినప్పుడు సీనియర్లు ఎంతో వేధించారని గుర్తుచేశారు. అనంతరం వైస్ పాదయాత్ర చేపట్టి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని, అదే ఉత్సాహంతో రేవంత్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో జనవరి 26 నుంచి రేవంత్‌రెడ్డి హాత్‌సే హాత్‌జోడో యాత్రను ప్రారంభించనున్నారని తెలిపారు. మక్తల్ నియోజకవర్గంలో ఎవ్వరికి టికెట్ వచ్చినా పార్టీ గెలుపే ధ్యేయంగా ముందుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, అయూబ్‌ఖాన్, పరమేష్, నల్గొండ శ్రీను, రహ్మతుల్ల, గణేష్‌ముదిరాజ్, విజయలక్ష్మి, కాజన్న, షబ్బీర్, నర్సింహ, గంగాధర్, బుచ్చన్న, ఈర్లదిన్నె శ్రీను, రఘు, హుస్సేన్‌మియా పాల్గొన్నారు.

వీపనగండ్ల: రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహించే హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్తను సమాయత్తం కావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరయ్యయాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మండలస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మీసాల పెద్ద రాముడు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు, సతీష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



ఖిల్లాఘనపురంలో విజేత జట్టుతో ఎంపీపీ తదితరులు

ఖిల్లాఘనపురం: యువత చదువుతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ కృష్ణానాయక్, ఎస్‌ఐ వెంటేశ్వర్‌గౌడ్, తహసీల్దార్ భానుప్రకాష్, ఎంపీడీఓ విజయ్‌కుమార్ అన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా మండల పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి మొత్తం 12 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఖిల్లాఘనపురం సేవలాల్ జట్టుకు మెమెంటోతో పాటుగా రూ.7 వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన మామిడిమాడ జట్టుకు మెమెంటోతో పాటుగా రూ.4 వేల నగదును అందజేశారు. క్రీడాకారులందరికీ ఎస్‌ఐ స్టేషన్‌లోనే భోజనాలు ఏర్పాటు చేశారు.

పాన్‌గల్: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సమాజంలో ప్రయోజకులుగా మారేందుకు కృషి చేయాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ నాగన్న సూచించారు. జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పోలీసుల ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించి విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు అందజేశారు. కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో అన్నారం జట్టు, ద్వితీయ స్థానంలో కిష్టాపూర్ జట్లు నిలిచాయి. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ హైమావతి, సుధీర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తేవాలి

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తేవాలని కాంగ్రెస్ మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆశన్న కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడానికి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలలో పిచ్చి మొక్కలతో పాటు ఆకతాయిలు మద్యం సేవించడానికి అడ్డాగా మారాయన్నారు. గ్రామంలో క్రీడాకారులను దృష్టిలో ఉంచుకొని వాటిని వినియోగంలోకి తేవాలని మంగళవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి, తహసీల్దార్ అబ్రహం లింకన్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో గోవిందు, మదిలేటి యాదవ్, పురుషోత్తం యాదవ్, సోప్పరి రమేష్, ఈశ్వర్, నవీన్, చందు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

పెబ్బేరు: మండలంలో అయ్యవారిపల్లికి చెందిన యువకులు మంగళవారం బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ బంగారు శృతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలో కుటుంబ పాలనతో ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భగవంతుయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, అనుజ్ఞారెడ్డి, వెంకట్రామిరెడ్డి, అంజనేయులు, వెంకటస్వామి, రాఘవేందర్‌గౌడ్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో మంగళవారం ఉదయం ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీలను సర్పంచ్ శివకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 50 టీంలు పాల్గొన్నాయని తెలిపారు.

రూ.18.58 లక్షల కమీషన్ జమ

వీపనగండ్ల: మండలంలోని 8 మండల మహిళా సమాఖ్యల ద్వారా వానాకాలం సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు చేయగా అందుకు సంబంధించి రూ.18.58 లక్షల కమీషన్ డబ్బులు గ్రామాల్లోని మహిళా సంఘాల ఖాతాలో జమ అయినట్లు ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గోవర్ధనగిరి, కల్వరాల, కొర్లకుంట, పుల్గర్‌చర్ల, రంగవరం, సంగినేనిపల్లి, వల్లభాపూర్, వీపనగండ్ల గ్రామాల్లో మహిళా సమాఖ్యల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నుంచి 6,401 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయగా రూ.20.48లక్షల కమీషన్ వచ్చిందన్నారు. అందులో 8 కొనుగోలు కేంద్రాల్లో కొత్త గన్ని బ్యాగుల కొనుగోలు కోసం రూ.1.89లక్షలు ఖర్చు కాగా మిగిలిన రూ.18.58లక్షల గ్రామ సంఘాలలో జమ చేశామన్నారు. ఈ డబ్బులో 10శాతం జిల్లా సమాఖ్యలో, 45 శాతం స్త్రీనిధిలో డిపాజిట్ చేయాలని, మిగిలిన 45 శాతం డబ్బులు గ్రామ సంఘం చేసిన ఖర్చుల కోసం వాడుకోవాలని ఆయన తెలిపారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ పోటీలు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో బుధవారం నుంచి రెండురోజుల పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఖిల్లాఘనపురం క్రాంతి క్రీడా అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 16, 18, 20 స్థాయిల్లో బాలురు, బాలికలకు వేరువేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. 100 మీటర్ల పరుగు పందెంతో పాటుగా 200, 400, 800, 1500 మీటర్ల పరుగు పందెం పోటీలు, లాంగ్ జంప్, షాట్‌పుట్ పోటీలు నిర్వహిస్తామని వారు తెలిపారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన క్రీడాకారులకు మెమొంటోలతో పాటుగా నగదు బహుమతులు అందిస్తామన్నారు.

మానవ సేవ భగవంతుడి సేవలాంటిది

వనపర్తి క్రైం: సాటి మానవుడికి సేవ చేయడం అది తనలోని భగవంతుడికి సేవ చేసినట్లేనని అమ్మభగవాన్ శిష్యురాలైన అనుపమ దాసాజీ బోధించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బండారు నగర్‌లోని పీఎస్ పబ్లిక్ పాఠశాలలో 130మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా శ్రీ కల్కి అమ్మభగవాన్ అంతిమ ధ్యేయం మానవులకు ముక్తిని ప్రసాదించడం, ఆ ముక్తి స్థితిని పొందడానికి సులువైన మార్గం సేవ అని తన బోధనల ద్వారా కల్కి అమ్మ భగవాన్ శిష్యురాలు అనుపమ చెప్పారు. కార్యక్రమంలో సాయిరాం, నిర్మల, కరుణ, ఉమాదేవి, లక్ష్మి, సుధ, సువర్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చింతల హనుమాన్ ఆలయంలో శివదీక్షలు

వనపర్తి క్రైం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీ చింతల హనుమాన్ ఆలయంలో భక్తులు మంగళవారం శివదీక్షలు స్వీకరించారు. ఉదయం ఆలయంలో అభిషేకం, మహారుద్రాభిషేకం, భజనలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అనంతరం శివదీక్ష చేపట్టిన స్వాములకు నిత్యాన్నదానం చేశారు. సాయంత్రం అభిషేకం, అష్టోత్తరం, శివ శరణుగోష, తదితర పూజలతో ఆలయం అంతా శివనామస్మరణతో మారుమోగింది. కార్యక్రమంలో గురుస్వామి ధర్మయాదవ్, బాలస్వామి, భాను తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

ఖిల్లాఘనపురం: మండలంలోని హీర్లతండాలో మంగళవారం ఆంజనేయ స్వామి ఆలయంలో గిరిజనులు, స్వామి వారి మాలధారణ వేసుకున్న వారు పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి తండాలోని గిరిజనులంతా అభిషేకం, కలశ పూజ అనంతరం స్వామివారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ ఊరేగింపులో సుమారు 100 మంది అంజనేయ, శివ మాల ధారులు భజనలు, భక్తిగీతాలు ఆలపించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

అమరచింత: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ ఆపన్న హస్తంగా మారిందని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కిష్టంపల్లికి చెందిన కురుమన్నకు మంగళవారం రూ.44 వేల చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, మండల పార్టీ అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతన సాధనకు నిరంతర పోరాటం



సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న బుచ్చన్న

అమరచింత: కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు అయ్యే వరకు సీఐటీయూ రాజీలేని పోరాటం చేస్తుందని ఆసంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎస్ రమేష్ అన్నారు. సీఐటీయూ 17వ జాతీయ మహాసభలు ఈనెల 18 నుంచి 22వరకు బెంగళూరులో నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం పట్టణంలో సీఐటీయూ జెండాను బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటాలు చేస్తున్నామన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేస్తూ మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం విడ్డూరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై పెద్దెత్తున ఉద్యమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నర్సింహ, రమేష్, ప్రేమ్, కాకి శ్రీను, రంగన్న, రాఘవేంద్ర, మైబు, ప్రభాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బడి బయటి విద్యార్థుల గుర్తింపు



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సీఆర్పీ

అమరచింత: పట్టణంలోని ఆయా వార్డుల్లో తిరుగుతూ బడి మానేసిన విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించామని సీఆర్పీ స్వామి, హెచ్‌ఎం బాలస్వామి తెలిపారు. కొన్ని నెలలుగా పాఠశాలలకు హాజరు కాకుండా ఇంటి పట్టునే ఉంటూ ఇతర పనులను చేస్తున్న విద్యార్థుల వివరాలను ఆయా పాఠశాల హెచ్‌ఎంల ద్వారా సేకరించామని తెలిపారు. బడి మానిన విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి చదువు యొక్క ప్రాముఖ్యత గురించి వివరించి వారి పిల్లలను బడికి పంపేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అమరచింత పట్టణంలోని భవిత కేంద్రానికి సంబంధించిన విద్యార్థినితో పాటు ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థిని గుర్తించి 9వ తరగతిలో చేర్పించామని పేర్కొన్నారు.

రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీని తగ్గించొద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మదనాపురం: ప్రభుత్వం లబ్ధిదారులకు కిలో రేషన్ బియ్యం తగ్గించడం సరైంది కాదని, కరోనాతో ఇబ్బందులు పడ్డ ప్రజలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారని, ఇలాంటి సమయంలో ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం మంచి పద్ధతి కాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ నరేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. కేరళ తరహాలో రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను ప్రజలకు అందించాలని కోరారు. దీని ద్వారా పేదల్లో పౌష్టికాహార లోపాన్ని కొంతవరకు తగ్గించవచ్చని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి పేదలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చిరంజీవి, మన్నెం, కేవీపీఎస్ నాయకులు వెంకట్రాములు, చెన్నయ్య, వెంకటేష్, మొగిలి, నాగన్న, దావీదు, మొగులన్న పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మధుగౌడ్

వనపర్తి క్రైం: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో మంత్రి నిరంజన్ రెడ్డి ముందుంటారని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు మధుగౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జెడ్పీ సమావేశ మందిరంలో సంఘం పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ అధ్యక్షతన జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మధుగౌడ్ మాట్లాడుతూ అక్రిడేషన్ కార్డు ఉండి అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. రూ.25లక్షలతో జర్నలిస్ట్ యూనియన్ భవనం మంజూరయిందన్నారు. సమావేశంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు రవీందర్‌రెడ్డి, ప్రశాంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బోలెమోని రమేష్, జాతీయ మాజీ కౌన్సిల్ సభ్యుడు మల్యాల బాలస్వామి, ప్రధాన కార్యదర్శి మాధవరావు, ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కొండన్న, సీనియర్ జర్నలిస్టులు రాజు, పార్థారెడ్డి, ఊషన్న, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి మన్యం, అంజి, నవీన్, శివ, భాస్కర్, కుమార్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల ఏర్పాట్ల పరిశీలన



వనపర్తి క్రైం: వివేకానంద జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో స్వర్గీయ సింగిరెడ్డి తారకమ్మ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంటు పోటీలకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటీశ్రీధర్ మైదానంలో ఏర్పాట్లును పరిశీలించారు. రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో అన్ని జిల్లాల జట్లు పాల్గొంటాయని, మొదటి విజేతకు రూ.1.50లక్షలు, రెండో విజేతకు రూ.75వేలు, మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్ రెండు బహుమతులు కలిపి రూ.30వేలు ఉంటుందన్నారు. క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేయనున్నట్లు వాకిటి శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బండారు కృష్ణ, డైరెక్టర్ గిరి, హేమంత్, ప్రశాంత్, కోచ్ సురేష్ తదితరులు ఉన్నారు.

వాల్ పోస్టర్లు విడుదల

ఆత్మకూర్: టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆ సంఘం నాయకులు మంగళవారం ఆత్మకూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విడుదల చేశారు. జనవరి 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లోని మన్నెగూడ, నాగార్జునసాగర్‌రోడ్‌లో నిర్వహించే మహాసభకు ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు.



హరిత యాదాద్రి

వివిధ రకాల మొక్కలతో పచ్చదనం

యాదగిరిగుట్ట: ఆధ్యాత్మిక క్షేత్రంగా రూపుదిద్దుకున్న యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయం ప్రస్తుతం ప్రకృతి అందాలతో హరిత యాదాద్రిగా మారుతోంది. వైటీడీఏ ఆధ్వర్యంలో యాదాద్రీశుడి కొండ చుట్టూ నాటిన వివిధ రకాల మొక్కలు ఆకుపచ్చని అందాలతో భక్తులు, స్థానికులను ఆకట్టుకుంటున్నాయి. కొండపైన కృష్ణశిలతో ఆధ్యాత్మిక వాతావరణం, కొండకు దిగువన ఉన్న పచ్చదనం భక్తులను ఎంతగానో ఆహ్లాదపరుస్తున్నాయి.

మా రాష్ట్రంలోనూ గొర్రెల పంపిణీ పథకం

ఉత్తరాఖండ్ పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ నిత్వాల్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకాన్ని త్వరలోనే తమ రాష్ట్రంలోనూ అమలు చేస్తామని ఉత్తరాఖండ్ పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నిత్వాల్ ఆర్ఎస్ వెల్లడించారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని పశుసంవర్ధక శాఖ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఉత్తరాఖండ్ పశుసంవర్ధక శాఖ ప్రతినిధి బృందం తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, పశుసంవర్ధక శాఖ అధికారులతో భేటీ అయింది. తాము



ఉత్తరాఖండ్ ప్రతినిధి బృందానికి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న బాలరాజ్ యాదవ్

గుజరాత్, రాజస్థాన్‌ల నుంచి మాంసాన్ని దిగుమతి చేసుకుంటున్నామని, ఈ పథకం అమలు ద్వారా తెలంగాణలో మాదిరిగా మాంసం ఉత్పత్తి పెరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. కాగా, తమ పర్యటనలో భాగంగా గొర్రెల పంపిణీ పథకం అమలు తీరు, ఈ పథకం వల్ల లబ్ధి పొందిన కుటుంబాల ఆదాయ, స్థితిగతుల వివరాలను తెలంగాణ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా తెలంగాణలో ఈ పథకం అమలు ద్వారా జరిగిన లబ్ధితో పాటు ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శనంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నేతృత్వంలో అమలు జరుగుతున్న పలు కార్యక్రమాలను బాలరాజ్ యాదవ్ ఉత్తరాఖండ్ ప్రతినిధులకు వివరించారు. ఈ భేటీలో ఉత్తరాఖండ్ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి ఫెడరేషన్ డీజీఎం డాక్టర్ అశోక్‌బిస్త్, డీఎం సంజయ్ సక్సేనా, తెలంగాణ పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రాంచందర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

● కొత్త సచివాలయంలో..

సరికొత్త ఫౌంటెయిన్‌లు!

- పార్లమెంటు భవనం ముందున్న ఫౌంటెయిన్ తరహాలోనే...
- అక్కడ ఒక్కటే.. ఇక్కడ రెండు..
- సెక్రటేరియట్‌లో సిద్ధమైన 'ఢిల్లీ'డిజైన్ ఫౌంటెయిన్లు
- ధోల్పూర్ ఎర్రరాతితో నిర్మాణం
- ఫౌంటెయిన్ నుంచి నీళ్ల ధారలు.. వాటిపై లైట్ల కాంతులు..
- నూతన సచివాలయానికి అందాల సొబగులు





సచివాలయంలో సిద్ధమవుతున్న ఫౌంటెయిన్లు

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలోని పార్లమెంటు ముందు ధోల్పూర్ ఎర్రరాతితో నిర్మించిన ఫౌంటెయిన్ ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తుంది. పార్లమెంటు సభ్యులు సహా సందర్శకులు దాని ముందు నిలబడి ఫొటోలు దిగుతుంటారు.. ఇప్పుడు అచ్చుగుద్దినట్టు అలాంటి ఫౌంటెయినే తెలంగాణ కొత్త సచివాలయంలో సిద్ధమైంది. పార్లమెంటు ముందు ఒకటే ఫౌంటెయిన్ ఉండగా, సచివాలయంలో రెండు రూపుదిద్దుకున్నాయి. ఇప్పుడు ఇవి ఈ భవనానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతున్నాయి.

-ఇండోపర్షియన్ ఆకృతిలో గుమ్మటాలతో రూపుదిద్దుకుంటున్న సచివాలయానికి మరో ప్రత్యేకత కూడా ఉండాలన్న ఉద్దేశంతో పార్లమెంటు ముందున్న ఆకృతిలో ఫౌంటెయిన్‌లను డిజైన్ చేశారు. సచివాలయ భవనం ముందు రెండు వైపులా విశాలమైన లాన్లు ఉంటాయి. వాటి మధ్యలో రెండు వైపులా రెండు ఫౌంటెయిన్‌లు నిర్మించాలని భావించి రకరకాల ఆకృతులు పరిశీలించారు. కానీ, చివరకు పార్లమెంటు ముందున్న ఆకృతిని ఎంపిక చేశారు.

- దిగువ 47 అడుగుల వెడల్పుతో భారీ వేదిక.. దానిమీద 25 అడుగుల వెడల్పుతో సాసర్ ఆకృతిలో నీటి తొట్టె, దాని మీద 9 అడుగుల వెడల్పుతో మరో తొట్టె.. ఈ మూడింటిని అనుసంధానిస్తూ దాదాపు 27 అడుగుల ఎత్తున్న శిల.. అంతా ఎరుపు రంగు.. ఇది దీని ఆకృతి.
- అప్పట్లో బ్రిటిష్ ఆర్కిటెక్ట్ దీన్ని డిజైన్ చేయగా పార్లమెంటు భవనం ముందు నిర్మించారు. ఇప్పుడు అదే డిజైన్‌ను వినియోగించి ఇక్కడ నెలకొల్పారు. పార్లమెంటు ముందున్న ఫౌంటెయిన్‌కు మొత్తం రాజస్థాన్‌లోని ధోల్పూర్ ఎర్రరాతి ఫలకాలను వాడారు. ఆ నిర్మాణానికి ప్రత్యేకంగా రంగు ఉండదు. ఇక్కడ కూడా అదే రాతిని వినియోగించటం విశేషం.
- సచివాలయం బేస్‌కు పూర్తిగా ఈ ఎర్రరాయినే వాడారు. ఇందుకోసం రాజస్థాన్ ధోల్పూర్ క్వారీలకు వెళ్లి అక్కడ రాయిని ఎంపిక చేసి తెప్పించిన విషయం తెలిసిందే. పార్లమెంటు ముందున్న ఫౌంటెయిన్ తరహాలోనే పాట్నాలో ఇటీవల ఫౌంటెయిన్‌ను రూపొందించిన శిల్పిని కలిసి చర్చించి సలహాలు తీసుకున్నారు. ఇప్పుడు అదే డిజైన్‌తో రెండు ఫౌంటెయిన్ల నిర్మాణం పూర్తయింది. దీంతో సచివాలయ ప్రధాన నిర్మాణం పనులు పూర్తయినట్టయింది. ఈ ఫౌంటెయిన్ నుంచి నీళ్ల ధారలుగా ఎగజిమ్మి దిగువకు పడుతుండగా, వాటిపై లైట్ల కాంతులు ప్రసరిస్తూ అందాన్ని రెట్టింపు చేస్తాయి.

భర్త మరణం తట్టుకోలేక...

భార్య బలవన్మరణం|ప్రేమ వివాహంలో విషాదం.. అనాథలైన ఇద్దరు పిల్లలు



భార్గవి, భర్త అశోక్ (ఫైల్)

రాజంపేట: ప్రేమించి పెళ్లి చేసుకున్న దంపతులను విధి వక్రించింది. భర్త ప్రమాదవశాత్తు మరణించగా, భర్త మరణాన్ని తట్టుకోలేక భార్య ఆత్మహత్య చేసుకుంది. కామారెడ్డి జిల్లా రాజంపేట మండల కేంద్రానికి చెందిన మెత్తల అశోక్, అదే గ్రామానికి చెందిన భార్గవి (24) నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ధన్సిక (3), అద్వైత్(2) ఉన్నారు. గత నెల 21న తన వ్యవసాయ బావి వద్ద పశువులకు నీరు పెట్టడం కోసం బావిలోకి దిగుతుండగా కాలు జారి పడి అశోక్ మృతి చెందాడు. భర్త మరణం జీర్ణించుకోలేకపోయిన భార్గవి నిత్యం మనోవేదనకు గురయ్యేది. ప్రేమగా



తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు ధన్సిక, అద్వైత్

చూసుకునే భర్త దూరం కావడంతో ఇక తాను బతకడం వ్యర్థం అని భావించి మంగళవారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుంది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. 20 రోజుల వ్యవధిలోనే భార్యాభర్తలు మరణించడం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. అశోక్ గ్రామంలో తాపీ పని చేస్తూ వ్యవసాయ పనులు చూసుకునేవాడు. భార్గవి బీడీలు చుడుతూ భర్తకు చేదోడువాదోడుగా ఉండేది. భార్గవి తండ్రి కూరెల్లి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.


భారతీయ టెక్ స్టార్టప్‌లపై..

టీ హబ్ 'గ్లోబల్ ఇమర్షన్'

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఆవిష్కరణల వాతావరణానికి మూల స్తంభంలా నిలుస్తోన్న 'టి హబ్'.. అమెరికాకు చెందిన టెక్నాలజీ యాక్సిలేటర్ సంస్థ ఫాల్కన్ ఎక్స్ భాగస్వామ్యంతో రెండో విడత 'గ్లోబల్ ఇమర్షన్ ప్రోగ్రామ్'ను ప్రారంభించింది. వివిధ రంగాలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను తమ ఉత్పత్తులు, ఆవిష్కరణల ద్వారా పరిష్కారం చూపుతున్న భారతీయ టెక్ స్టార్టప్‌లపై గ్లోబల్ ఇమర్షన్ కార్యక్రమం దృష్టి కేంద్రీకరిస్తుంది. మూడు వారాల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన అత్యుత్తమ స్టార్టప్‌లు అమెరికాలో తమ వాణిజ్య కార్యకలాపాలను విస్తరించుకునే అవకాశం లభిస్తుంది. ఎంపికయ్యే స్టార్టప్‌లకు సిలికాన్ వ్యాలీలోని 40కి పైగా ఎంట్రప్రెన్యూర్లు, పెట్టుబడుదారులు, నిపుణుల నుంచి మార్గదర్శనం లభిస్తుంది. ఎంపికైన స్టార్టప్‌లకు రూ.8 లక్షల నుంచి రూ.9లక్షల వరకు స్టైపండ్ లభిస్తుంది.

ఊహలు వద్దు... ఆశకు పోవద్దు

- నిర్వహణ ఖర్చులను కచ్చితంగా చూపెట్టండి
- గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దులో జీతాలు చూపించొద్దు
- వచ్చే ఏడాదిలో ఎన్ని ఉద్యోగాలు ఇవ్వాల్సి వస్తుందో ప్రత్యేక ప్రొఫార్మాలో ఇవ్వండి
- 2023–24 బడ్జెట్ వివరాల కోసం ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ



సాక్షి, హైదరాబాద్: రానున్న ఆర్థిక సంవత్సరానికి (2023–24) గానూ బడ్జెట్ తయారీ కోసం అన్ని శాఖలు ఈనెల 12లోగా ప్రభుత్వానికి పంపాలని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఈనెల 12 కల్లా ప్రభుత్వ విభాగాధిపతులకు వివరాలు వస్తే వాటికి అవసరమైతే మార్పులు చేర్పులు చేసి ఈనెల 13 కల్లా ఆర్థిక శాఖ వెబ్‌సైట్‌లో పొందుపరచాలని అన్ని ప్రభుత్వ శాఖల అధిపతులకు సూచించింది. ఈ మేరకు 2023–24 బడ్జెట్ ప్రతిపాదనలు, 2022–23 సవరించిన బడ్జెట్ అంచనాలను రూపొందించేందుకు గాను మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులను ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు విడుదల చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బడ్జెట్ ప్రతిపాదనలు పకడ్బందీగా పంపాలని, ఊహాజనిత అంచనాలు, లెక్కకు మిక్కిలి ప్రతిపాదనలు పంపవద్దని సూచించారు.

ప్రత్యేక అంశాలతో ఉత్తర్వులు

శాఖల వారీగా పంపాల్సిన బడ్జెట్ వివరాలతో పాటు ఏయే విషయాల్లో జాగ్రత్తగా ఉండాలో కొన్ని సూచనలు చేశారు. వాటి ప్రకారం... ప్రతి శాఖ గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఖర్చులను తగ్గించుకోవాల్సి ఉంటుంది. ఆయా శాఖల పరిధిలోని ఉద్యోగుల జీతాలను ఎట్టి పరిస్థితుల్లోనూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దు (310–312)లో చూపించకూడదు. అలా చూపించినట్టు గుర్తిస్తే సదరు అధికారిపై క్రమశిక్షణా చర్యలు తీసు కుంటామని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ప్రతి శాఖకు సంబంధించిన ఖర్చులను విడివిడిగా చూపించవద్దని, అన్ని ఖర్చులను ఒకచోట చూపించాలని కూడా పేర్కొన్నారు. ఇక, శాఖల నిర్వహణ, ఆఫీసు ఖర్చులు, వాహనాలు, అద్దెలు, నీరు, విద్యుత్ ఖర్చులు, స్టేషనరీ, ఔట్‌సోర్సింగ్ సర్వీసులు, సంక్షేమ, సబ్సిడీ పథకాలకు సంబంధించిన ఖర్చులను జాగ్రత్తగా చూపెట్టాలని తెలిపారు. ప్రతి శాఖ పరిధిలో 2023–24లో జాయిన్ అయ్యే కొత్త ఉద్యోగుల వివరాలను (ఖాళీగా ఉన్న, కొత్తగా మంజూరైన పోస్టులు కాకుండా) కూడా ప్రత్యేక ఫార్మాట్‌లో పంపాలని ఆ ఉత్తర్వుల్లో వెల్లడించారు. ఇక ప్రభుత్వ శాఖకు సంబంధించిన ఆస్తులు, అప్పుల వివరాలను కూడా ప్రత్యేక ఫార్మాట్‌లో పంపాలని ఆర్థిక శాఖ తెలిపింది. గత పదేళ్ల నుంచి రెవెన్యూ కింద చూపెట్టినా రాని పన్నుల వివరాలను కూడా కోరింది.

ఇథనాల్ కంపెనీ రద్దుకు పోరాటం



మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి

నారాయణపేట టౌన్: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ పార్టీల నాయకులు స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాలమూర్ అధ్యయన వేదిక కో–కన్వీనర్ సుదర్శన్, కుల నిర్మూలన పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకట్రామారెడ్డి, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి పాల్గొని మాట్లాడారు. ఇథనాల్ కంపెనీ రద్దు చేసేందుకు పోరాటం చేస్తామని, ప్రజలు, రైతులు చేస్తున్న ఉద్యమానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రజలకు ఉపయోగపడే పారిశ్రామికీకరణ చేపట్టాలి తప్పా నష్టం కలిగించే కంపెనీలకు అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, టీఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు ఖలీల్, మక్తల్ జేఏసీ నాయకులు సూర్య ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమల యాత్రకు ప్రత్యేక బస్సులు

- అయ్యప్ప మాలధారుల కోసం ఆర్టీసీ ఏర్పాట్లు
- ఇప్పటి వరకు 22 బస్సుల బుక్కింగ్
- సంక్రాంతికి సైతం 360 అదనపు సర్వీసులు

యాత్రకు బుక్ అయిన బస్సుల వివరాలు..

డిపో	బస్సులు
అచ్చంపేట	2
మహబూబ్‌నగర్	6
నాగర్‌కర్నూల్	6
షాద్‌నగర్	8





మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో శబరిమలకు బయలుదేరుతున్న ప్రత్యేక బస్సు (ఫైల్)

స్టేషన్ మహబూబ్‌నగర్: శబరిమలకు తరలనున్న అయ్యప్ప మాలధారుల కోసం మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నారు. రీజియన్‌లోని పలు డిపోల నుంచి శబరిమలకు వెళ్లడానికి ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచారు. గత ఏడాది కంటే శబరిమలకు వెళ్లేందుకు ఈ సారి ఎక్కువ బుకింగ్స్ వచ్చాయి. గత ఏడాది శబరిమల యాత్రకు 10 బస్సులు వెళ్లగా, ఈ ఏడాది ఇప్పటివరకు రీజియన్‌లోని పలు డిపోల నుంచి 22 బస్సులు బుక్ అయ్యాయి. ఇప్పటికే కొన్ని బస్సులు శబరిమలకు వెళ్లి వచ్చాయి. 36 మందితో కూడిన అయ్యప్ప మాలధారులు శబరిమలకు వెళ్లడానికి సూపర్ లగ్జరీ బస్సులను సైతం అందుబాటులో ఉంచారు.

పండగ నిమిత్తం అదనపు సర్వీసులు

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌లో 360 అదనపు సర్వీసుల నడపడానికి తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే రీజియన్ పరిధిలోని కొన్ని డిపోల నుంచి బస్సులు హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు దూర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. మరో రెండు, మూడు రోజుల్లో సంక్రాంతి పండగ సెలవుల నేపథ్యంలో నేడు, రేపటి నుంచి ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ ఉండే అవకాశం ఉంది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ సంస్థ అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా అన్ని డిపోల నుంచి హైదరాబాద్ రూట్లో ఎక్కువ సంఖ్యలో అదనపు సర్వీసులు నడపడానికి చర్యలు తీసుకుంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



శబరిమల పుణ్యక్షేత్రానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతుండగా.. యాత్రికుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం శుభకార్యాలు, పెళ్లిళ్లు, విజ్ఞాన, విహార యాత్రలకు అద్దె ప్రాతిపదికన ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నాం. 30 మంది ప్రయాణికులు ఉంటే వారు ఉండే కాలనీకే బస్సును పంపించేలా ఏర్పాట్లు చేశాం. ప్రజలు ఆయా డిపోల్లో సంప్రదించి బస్సులను బుక్ చేసుకోచ్చు. – శ్రీదేవి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, మహబూబ్‌నగర్






తెలంగాణలోని విశ్వవిద్యాలయాల విద్యార్థులకు జీ-20 ప్రెసిడెన్సీపై మంగళవారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల విజేతలకు గవర్నర్ తమిళిసై అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె నుంచి పాలమూరు విశ్వవిద్యాలయానికి చెందిన పార్వతి, వేణులు ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు.

జోగుళాంబ ఆలయ క్యాలెండర్ విడుదల



జోగుళాంబ దేవి క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ అనిల్‌కుమార్



బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో మాజీ డీజీపీ దంపతులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపురం శ్రీ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి దేవస్థానం క్యాలెండర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఆవిష్కరించారు. దేవస్థానం ప్రచారంలో భాగంగా ఆలయాల్లో జరిగే నిత్య పూజా కార్యక్రమం మరియు ఆలయాల సమయపాలన ఇక్కడి విశేష పూజా కార్యక్రమాలు, దర్శించవలసిన ఆలయాలను పొందు పరుస్తూ ప్రమోద్‌కుమార్ అనే భక్తుడు క్యాలెండర్‌ను తయారు చేసి దేవస్థానానికి అందజేశారని ఆలయ ఈఓ పురేందర్ దేవాదాయ శాఖ కమిషనర్ అనీల్ కుమార్‌కు తెలిపారు.

జోగుళాంబ ఆలయంలో మాజీ డీజీపీ

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను మంగళవారం మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. గణపతికి అభిషేకాలు, బాలబ్రహ్మేశ్వరుడికి ధనుర్మాస పూజలు ఏకవార రుద్రాభిషేకాలు, జోగుళాంబ అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. వీరితో పాటు డీఎస్పీ రంగస్వామి, ఎస్.ఐ శ్రీహరి ఉన్నారు.

బీచుపల్లిలో ప్రత్యేక పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని రాష్ట్ర మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామిని దర్శించుకొని ఆకుపూజ, అభిషేకం వంటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందించి ఆలయ విశిష్టత గురించి వివరించారు.

బదిలీలు, పదోన్నతులకు సీఎం సుముఖం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి

వనపర్తి టౌన్: ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులు కల్పించేందుకు సీఎం కేసీఆర్ సుముఖంగా ఉన్నారని హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి అన్నారు. న్యాయపరమైన చిక్కులతోనే ఆలస్యం అవుతుందని తెలిపారు. మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పన్నెండేళ్లుగా ఎమ్మెల్సీగా ఉంటూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిస్వార్థంగా, స్వలాభాపేక్ష లేకుండా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి అవకాశం ఇస్తే ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో ఎంప్లాయిస్ హెల్త్ స్కీం అమలయ్యేలా చూస్తామని, ఇందుకు ఉపాధ్యాయుల పేస్కేల్ నుంచి ఒక శాతం కట్ చేసుకుని, మిగతాది ప్రభుత్వం జమ చేస్తూపోతే ఈహెచ్ఎస్‌కు ఢోకా ఉండదని, సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కేజీబీవీల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కేవలం 10నెలల పాటు ఉన్న వేతనాన్ని 12నెలలు చెల్లించేలా చేశామన్నారు. 180 రోజుల మెటర్నిటీ లీవ్‌లతో వేతనం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఉపాధ్యాయరంగ సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, త్వరలోనే అన్నీ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. 317 జీఓ ప్రకారం దూర ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు తీసుకొచ్చేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, జీహెచ్ఎంల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మద్దిలేటి, గణేష్ పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే ముదిరాజుల సంక్షేమం

భూత్పూర్: సీఎం కేసీఆర్‌తోనే ముదిరాజులకు గుర్తింపు వచ్చిందని, కేసీఆర్‌తో ముదిరాజుల సంక్షేమం, కుటుంబాలు బాగుపడ్డాయని ఎమ్మెల్సీ బండప్రకాష్ అన్నారు. మంగళవారం భూత్పూర్ మున్సిపాలిటీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి మత్స్యకారుల 2023 సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బండ ప్రకాష్ మాట్లాడుతూ తన ఎమ్మెల్సీ నిధులు ప్రతి ఏటా రూ.5 కోట్లు సీఎం కేసీఆర్ చొరవతో కేటాయిస్తుండగా ముదిరాజుల కోసం రూ.3 కోట్ల, 50లక్షలు ముదిరాజుల భవన నిర్మాణం కోసం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కర్వెన ప్రాజెక్టు పూర్తయితే కోటి చేపపిల్లలు పెంచడం జరుగుతుందని, పాలమూరు ప్రాజెక్టులో 6 ప్యాకేజీల చేపపిల్లల పెంచి తెలంగాణలో అత్యధికంగా చేపల విక్రయంగా మార్పు చెందే అవకాశం ఉందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, మత్స్య సహకారం సంఘం జిల్లా అధ్యక్షుడు మనిమోని సత్యనారాయణ, ముడా చైర్మన్ గంజి వెంకన్న, డైరెక్టర్లు చంద్రశేఖర్‌గౌడ్, సాయిలు, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చంద్రమౌళి, గోప్లాపూర్ సత్యనారాయణ, బోల వెంకట్రాము, అచ్చన్న, గొడుగు వెంకట్‌రాజు, ఎర్ర బాలప్ప, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ముదిరాజు సంఘం నాయకులు పాల్గొన్నారు.



భూత్పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బండ ప్రకాష్

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం పూర్తి స్థాయి నీటి మట్టం 1,020 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 422 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 800 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.